

11 అర్జీల స్వీకరణ

ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యతిస్తూ మళ్లీ అర్జీలు పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా చట్ట పరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వివిధ రకాల సమస్యలతో వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను ఎస్‌పి స్వయంగా స్వీకరించారు. వారి సమస్యలను విని, పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 11 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్‌పి వి.భీమారావు, ఎస్‌బి సిఐ వి.పుల్లారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరికి ఊరట..!

ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు చదువుతున్న కళాశాలల ఖాతాలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఇదే సమయంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను సాకుగా చూపి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయా కళాశాలల యాజమాన్యాలను హెచ్చరించారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జమతో ఎవరికి ఊరట లభిస్తుందనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది.

కళాశాలల ఖాతాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

30వ తేదీలోపు వెబ్‌సైట్‌లో వివరాల నమోదుకు ఆదేశం

75 శాతం హాజరు ఉంటేనే ఫీజు రీయింబర్స్‌మెంట్

కేంద్రం 60 శాతం వాటా చెల్లిస్తేనే ఎస్‌సి విద్యార్థులకు వర్తింపు.. లేకపోతే ఇబ్బందులే

జిల్లాలో పేరుకుపోయిన రూ.150 కోట్లు బకాయి

సొమ్ము కోసం కళాశాలల యాజమాన్యాల ఎదురుచూపు

ప్రజాశక్తి - భీమవరం

ఐటిఐ, పాలిటెక్నిక్, డిప్లమో, డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇతర వృత్తి పరమైన కోర్సుల్లో చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించనుంది. ఈ ఏడాది ఆయా తరగతుల్లో రెగ్యులర్ బ్యాచ్‌ల కింద చేరిన వారు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో లక్ష మంది వరకు ఉంటారని అంచనా. వీరంతా ఈ నెల 30వ తేదీలోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంది. గత ప్రభుత్వ పుణ్యమా అని నేటికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు నానావస్థలు పడుతున్నారు. విద్యాదీవెన పథకం కింద సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతో గత ఐదేళ్లు విద్యార్థులు అష్టకష్టాలు పడ్డారు. పలు నిబంధనలతో బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిప్పారు. ఖాతాలకు నగదు వేస్తామని చెప్పినా.. కొందరికే లబ్ధి చేకూరింది. రెండు, మూడేళ్ల నుంచి చాలామంది విద్యార్థులకు నగదు జమకాకపోవడంతో వారు కళాశాలలకు చెల్లించలేకపోయారు. దీంతో సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు మొండికేస్తున్నాయి. 2019- 20లో ఏకమొత్తంలో చెల్లింపులు చేశారు. ఆ తర్వాత నాలుగు విడతల్లో ఇస్తామని చెప్పారు. 2020-21లో మూడు విడతలు, 2021-22, 2022-23, 2023-24లో ఆ ఊసే లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై దృష్టి సారించి కళాశాలల ఖాతాలో జమ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచి దీనిని అమలులోకి తీసుకురానుంది. ప్రతియేటా జిల్లాలో రూ.100 కోట్లు మేర ప్రభుత్వం తల్లుల ఖాతాలో జమ చేస్తూ వచ్చింది. ఈ ఏడాది ఫీజులు పెరిగాయి. కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులు అధికమయ్యాయి. దీంతో అదనంగా ప్రభుత్వంపై మరో రూ.20 కోట్లు భారం పడుతోంది. మొత్తంగా ఈ ఏడాది నుంచి రూ.120 కోట్ల మేర కళాశాలల ఖాతాల్లో జమ చేయాలి. జిల్లాలో 36 వేల మంది విద్యార్థులకు ఉపశమనం లభించింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందినవారికి తప్పనిసరిగా 75 శాతం హాజరు ఉండాల్సిందేననే నిబంధన పెట్టారు. లేకుంటే రీయింబర్స్‌మెంట్ వర్తించదు. కన్వీనర్ కోటాలో సీటు పొందిన వారు కూడా అనర్హులుగా మిగిలిపోనున్నారు. ఇప్పటికే ఆయా కళాశాలల యాజమాన్యాలే అర్హుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని ఆదేశాలు కూడా వెలువడ్డాయి.

వైసిపి ప్రభుత్వం ఎన్నికల ఏడాది ముందు నుంచి ఫీజులు చెల్లించలేదు. అంతకు ముందున్న బకాయిలనూ జమ చేయలేదు. ఇది మొత్తంగా కళాశాలలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. జిల్లాలో దాదాపు రూ.150 కోట్ల మేర బకాయిలు పేరుకుపోయాయి. యాజమాన్యాలు వాటి కోసం ఎదురుచూస్తున్నాయి. వేతనాలు చెల్లించడానికి ఆపసోపాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జమ చేసే సొమ్ము కోసం కళాశాలలు ఎదురు చూస్తున్నాయి.

వీరికి మినహాయింపు..

ఈ ఏడాది ఎస్‌సి విద్యార్థులకు కేంద్రం నుంచి 60 శాతం వాటా రావాల్సి ఉన్నందున వారికి మినహా, మిగిలిన వారికి చెల్లింపులు పూర్తి చేయనున్నారు. ప్రీ, పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాల కింద ఎస్‌సిలకు కేంద్రమే ఇస్తుంది. వారంతా తమ బ్యాంకు, తపాలా ఖాతాలను ఎన్‌సిపిఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)లో నమోదవ్వాలి. ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాలు, తపాలా కార్యాలయాలను సంప్రదించాల్సి ఉంటుంది. గతంలో వారి ఫీజును ప్రభుత్వమే కళాశాలలకు చెల్లించేది. ఇప్పుడు అటువంటి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లేదంటే ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు కాస్త ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ప్రయివేటు కళాశాలల్లో పీజీ కోర్సుల నిర్వహణకు యాజమాన్యాలు ఆసక్తి చూపడం లేదు. ఎన్నికల ముందు కూటమి అధిష్టానం దృష్టికి విద్యార్థులు తమ సమస్యను తీసుకెళ్లారు. ఇప్పుడు పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

విద్యార్థులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

చదలవాడ నాగరాణి, కలెక్టర్




ఫీజు చెల్లించకపోవడం వల్ల కొంతమంది డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులకు సర్టిఫికెట్లను ఇవ్వకపోవడం, వారిని పరీక్షలు రాయనీకపోవడం జరుగుతోందని నా దృష్టికి వచ్చింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యల కారణంగా ఏఒక్క విద్యార్థికీ హాల్‌టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు, ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకాకుండా అడ్డుకుంటే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఆపితే సంబంధిత కళాశాలను బ్లాక్‌లిస్టులో పెడతాం. ప్రభుత్వం ఫీజును కళాశాలల ఖాతాలకు జమ చేసే విధంగా జిఒ జారీ చేసింది. కళాశాలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం చెల్లిస్తుంది.

నెల రోజుల్లో డయాలసిస్ సెంటర్ ప్రారంభం

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్‌ను నెల రోజుల్లో ప్రారంభించేలా పనులు వేగవంతం చేసినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. స్థానిక వంద పడకల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. గత టిడిపి ప్రభుత్వంలో రూ 12.60 కోట్లు మంజూరవ్వగా రెండు నెలల్లో పూర్తి కావాల్సిన పనులను జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పూర్తి చేయలేదని విమర్శించారు. చేసిన పనులు కూడా రోగులకు పనికిరాకుండా ఇష్టానుసారంగా చేపట్టారని ఆరోపించారు. ఆయా పనులను గత 4 నెలలుగా గాడిలో పెట్టేందుకు క్షేత్రస్థాయి పరిశీలనతోపాటు అధికారులు, ఏజెన్సీతో తరచూ సమీక్ష చేసినట్లు మంత్రి చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, జివి, బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు, కర్నేన గౌరునాయుడు పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి నిమ్మల

లేసుకు భౌగోళిక గుర్తింపు

కలెక్టర్‌కు సర్టిఫికెట్ అందజేత

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర ప్రభుత్వం జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం న్యూఢిల్లీలోని హోటల్ ఒబెరాయ్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నరసాపూర్ క్రోచెట్ లేస్ ప్రొడక్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర జౌళి శాఖా మంత్రి గిరిరాజ్ సింగ్ చేతులమీదుగా (జిఐ) సర్టిఫికెట్ అందుకున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన ఎనిమిది జౌళి చేతి ఉత్పత్తుల్లో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం లేసుకు భౌగోళిక సూచిక (జిఐ) గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిఐ ట్యాగ్ చేయబడిన ఉత్పత్తులతో వేల మంది నేత కార్మికులు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వగలుగుతామన్నారు. ప్రత్యేక ఉత్పత్తుల ప్రోత్సాహం, మార్కెట్ లింకేజీ, బ్రాండింగ్ ప్రమోషన్ లక్ష్యంగా నేడు ఢిల్లీలో వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. భారతీయ టెక్స్‌టైల్ పరిశ్రమలో చేతితో నేసిన, చేతితో తయారు చేసిన వస్త్రాలు దేశంలో భౌగోళిక సూచిక నమోదిత ఉత్పత్తుల పట్టికలో అగ్రగామిగా ఉన్నాయని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రదర్శించిన దేశంలో జిఐ ట్యాగ్ చేయబడిన హ్యాండ్లూమ్స్, హస్తకళా ఉత్పత్తులు విశేషంగా ఆకట్టుకున్నాయన్నారు. లేసు తయారీదారులందరికీ ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.



సర్టిఫికెట్‌ను అందుకుంటున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యతివ్వాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 177 వినతులను సేకరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డివిజన్, మండలస్థాయిలో జరుగుతున్న పిజిఆర్ఎస్‌ను పరిశీలించి, ఎంతమంది అధికారులు వచ్చారు, ఏఏ శాఖల అధికారులు రాలేదనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాజరు కాని అధికారులపై అసహనం వ్యక్తం చేస్తూ, మూడు వారాలుగా హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. వచ్చే సోమవారం కూడా ఇదే పరిస్థితి పునరావృతమైతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. గత నెల, ఈ నెలలో ఇప్పటి వరకు ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఎన్ని పరిష్కారమయ్యాయని మండలాలవారీగా అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ సమస్యలు వస్తుంటే ఆయా శాఖల అధికారుల పనితీరుకు అద్దం పడుతుందన్నారు. తప్పని పరిస్థితుల్లో సెలవు పెట్టి, అనుమతి పొందిన తర్వాత అధికారి వెళ్లాలని, ఆయన స్థానంలో తర్వాత అధికారి హాజరై ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, కెఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ బి.శివనాయణరెడ్డి, డిఎల్‌డిఒ వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ సభ్యులు మేళం దుర్గా ప్రసాద్, లీగల్ సర్వీసెస్ న్యాయవాదులు కందిబోయిన జ్యోతి, రాపర్తి జ్యోతి పాల్గొన్నారు.



ప్రజల నుంచి సమస్యలు వింటున్న జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి

'టోల్' బాదుడుకు రంగం సిద్ధం..!

జిల్లాలోని రాష్ట్ర రహదారులపై టోల్ వసూళ్లకు సర్కార్ ప్రణాళిక

మొదటి జాబితాలో రెండు జిల్లాల్లో మూడు రోడ్లు ఎంపిక

ఏలూరు-జంగారెడ్డిగూడెం, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, నరసాపురం-అశ్వారావుపేట రోడ్లు

రెండు జిల్లాల్లో దాదాపు 13 వరకూ రాష్ట్ర హైవేలు

ప్రతి రహదారిపైనా పిపిపి విధానంలో టోల్‌గేట్ల ఏర్పాటు

రవాణా ఛార్జీలు భారీగా పెరిగి ప్రజలపై పెనుభారం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలోని రాష్ట్ర హైవేలపై టోల్‌గేట్లు ఏర్పాటు చేసి రుసుము వసూలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అందుకు సంబంధించి తొలివిడత రోడ్ల జాబితాను సైతం విడుదల చేసింది. తొలి జాబితాలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏలూరు-జంగారెడ్డిగూడెం, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం, నరసాపురం-అశ్వారావుపేట మొత్తం మూడు రాష్ట్ర హైవేలు ఉన్నాయి. ఈ రోడ్ల మరమ్మతులకు ఇక నుంచి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా పిపిపి (ప్రభుత్వ, ప్రయివేటు భాగస్వామ్యం) విధానంలో కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. నేషనల్ హైవే తరహాలో టోల్‌గేట్లు ఏర్పాటు చేసుకుని, రోడ్లపై గోతులు పూడ్చే పని కాంట్రాక్టర్ చేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజలపై పెనుభారం పడే పరిస్థితి నెలకొంది. రవాణా ఛార్జీలు భారీగా పెరగడంతో అన్ని వస్తువుల ధరలూ పెరిగి ప్రజల నెత్తిన పడనుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 13 రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటిలో ఏలూరు-భీమవరం, భీమవరం-నరసాపురం, ఏలూరు-తాడేపల్లిగూడెం, పాలకొల్లు-నిడదవోలు, తాడేపల్లిగూడెం-తణుకు, ద్వారకాతిరుమల-భీమవరం, పోలవరం-కొయ్యలగూడెం, ఏలూరు-మేడిశెట్టివారిగూడెం, ఏలూరు-జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెం-భీమవరం వంటి రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఈ రోడ్లన్నీ నేషనల్ హైవేలకు అనుసంధానమై ఉన్నాయి. ఇప్పటికే జిల్లా పరిధిలో నేషనల్ హైవేపై కలపర్రు, ఉంగుటూరు ప్రాంతంలో రెండు టోల్‌గేట్లు ఉన్నాయి. కారుకు రూ.105, లారీలకు రూ.250 నుంచి టైర్ల సామర్థ్యం బట్టి టోల్ వసూలు చేస్తున్నారు. బస్సులకూ అదే పరిస్థితి కొనసాగుతోంది. తాడేపల్లిగూడెం నుంచి విజయవాడ కారులో వెళ్లేందుకు కిరాయికి మాట్లాడుకుంటే టోల్ ఫీజుల భారంతో కలిపి యజమానులు కిరాయి వసూలు చేస్తున్నారు. దీంతో కిరాయి తడిసి మోపెడవుతోంది.



రవాణా ఛార్జీల పెంపుతో జనంపై భారం..

జిల్లాలోని రాష్ట్ర హైవేల్లో ప్రతిరోజూ పెద్దఎత్తున వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. టోల్‌గేట్లు పెట్టి రుసుములు వసూలు చేస్తే రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో ధరలు పెరిగి ప్రజలపై పెనుభారం పడనుంది. బైక్, ఆటోలు, ట్రాక్టర్లకు టోల్ వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. వ్యవసాయ పంట అంతా రైతులు లారీలపైనే రవాణా సాగుతోంది. దీంతో లారీల యజమానులు రైతుల నుంచి టోల్‌తో కలిపి కిరాయి వసూలు చేస్తారు. రైతులపై మరింత పెనుభారం పడనుంది. బస్సు టిక్కెట్ టోల్ ఛార్జీలు ప్రత్యేకంగా వసూలు చేస్తారు. దీంతో బస్సు టిక్కెట్ల ధరలు పెరగడంతో జనంపై భారం పడనుంది. ఇలా అనేక రూపాల్లో టోల్‌భారం జనాలపై పడే పరిస్థితి ఉంది. రోడ్ల మరమ్మతుల నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు ఈ విధమైన ప్రణాళికతో ముందుకు సాగుతుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్లు ఏర్పాటు ప్రతిపాదనపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ప్రభుత్వం మొండిగా ముందుకు సాగితే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తప్పదనే చర్చ సర్వత్రా సాగుతోంది. ప్రభుత్వం రాష్ట్ర రహదారులపై టోల్‌గేట్ల ఏర్పాటు ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అదానీని అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి - మొగల్తూరు

బిజెపి అండతో బడా పెట్టుబడీదారులు, వ్యాపారులు దేశాన్ని దోచుకుతింటున్నారని సిపిఎం నేత ఒడుగు శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతంలో గౌతమ్ అదానీని అరెస్టు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీపై అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, అదానీ గ్రూపు అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యడ్ల చిట్టిబాబు, వీర పాండురంగారావు, కొత్త విజయకుమార్, కొత్తపల్లి నాగరాజు, కొల్లాటి బాబూరావు, బజారు జట్టు కార్మికులు పాల్గొన్నారు.



మొగల్తూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

అక్రమ చెరువు తవ్వకాన్ని అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - కాళ్ల

నిబంధనలను తుంగలో తొక్కి రెండు పంటలు పండే భూముల్లో అక్రమంగా రొయ్యల చెరువులు తవ్వేందుకు సిద్ధమవుతున్న రైతులపై అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ డిమాండ్ చేశారు. జువ్వలపాలెంలో సంతోషపురం వద్ద రొయ్యల చెరువు తవ్వకానికి వచ్చిన పొక్లెయిన్‌ను స్థానికులు సోమవారం అడ్డుకున్నారు. సంతోషపురానికి ఆనుకుని ఉన్న భీమేశ్వరస్వామి దేవస్థాన భూమి అర్చకులకు ఇచ్చిన ఆర్ఎస్ నెంబర్ 420/2లో 10.92 ఎకరాల సారవంతమైన భూమిలో ఎటువంటి అనుమతులూ లేకుండా రొయ్యల చెరువులు తవ్వేందుకు రైతులు చేసిన ప్రయత్నాన్ని స్థానికులు అడ్డుకున్నారు. దీనిపై అక్కడకు చేరుకున్న గ్రామ రెవెన్యూ అధికారి చెరువు తవ్వకానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ జనావాసాలకు దగ్గర్లో చెరువులు తవ్వకూడదని చట్టం చెబుతున్నా నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల పక్కనే చెరువు తవ్విస్తే ఎస్‌సి, బిసిలు నిర్మించుకున్న ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, గాలి, నీరు కలుషితమై జనం అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని సంతోషపురం ప్రాంతానికి రక్షణ కల్పించాలని, గాలి, నీరు కాలుష్యం నుంచి ప్రజలను కాపాడాలని, లేనిపక్షంలో అక్కడ జరిగే నష్టానికి రైతులతో పాటు అధికారులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గాతల అల్ఫన్స్, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, గండికోట వెంకటేశ్వరరావు, కత్తుల చిన్న, గాతల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



జువ్వలపాలెంలో చెరువు తవ్వకాన్ని అడ్డుకున్న స్థానికులు

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - తణుకు

విశాఖపట్నంలో లా విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయాలని తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూరంపూడి కామేష్ డిమాండ్ చేశారు. సోమవారం బార్ అసోసియేషన్ హాలు వద్ద భారత న్యాయవాదుల సంఘం, ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విశాఖ లా విద్యార్థినిపై అత్యాచారం, తమిళనాడులో న్యాయవాది హత్యకు నిరసనగా న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సూరంపూడి కామేష్, కామన మునిస్వామి మాట్లాడుతూ న్యాయ విద్యార్థినిపై అత్యాచారం ఘటన చాలా దుర్మార్గమన్నారు. న్యాయవాది వృత్తికి రక్షణ కోసం సమగ్ర చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించాలని, న్యాయవాదులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి.పద్మావతి, ఎస్‌కె.మోతి, కలిదిండి పద్మావతి, ఎ.దుర్గాప్రసాద్, శ్రావణి, ఇ.రామకృష్ణ, అనుకుల రమేష్, జి.అంబేద్కర్, ముప్పిడి సుబ్బయ్య, అశోక్‌కుమార్, బాలరాజు, చింతపల్లి నాగేశ్వరరావు, బి.విక్టర్‌బాబు పాల్గొన్నారు.




నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

సామాన్యులకు భారంగా మోడీ పాలన : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొల్లు

సామాన్యులకు భారాలు.. కార్పొరేట్‌లకు వరాలుగా మోడీ పాలన ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని విమర్శించారు. సోమవారం స్థానిక మహిళా భవనంలో పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశం సిపిఎం నేత దిగుపాటి రాజగోపాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వాసుదేవరావు మాట్లాడుతూ లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తోందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడానికి బ్లాక్ మార్కెటింగ్ కారణమన్నారు. అదానితో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు బిజెపి విధానాలకు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వాసుదేవరావు కోరారు. పార్టీ మండల ఇన్‌ఛార్జి జిల్లా సెక్రటేరియట్ సభ్యులు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ డిసెంబరు 20, 21, 22 తేదీల్లో జిల్లా మహాసభ భీమవరంలో జరుగనుందని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ పెరుగుదలకు స్థానిక సమస్యలపై దృష్టి పెట్టి పనిచేయాలని సూచించారు. పార్టీ జిల్లా కమిటీ నిర్ణయం మేరకు నలుగురు సభ్యులతో కన్వీనింగ్ కమిటీని నియమించారు. కన్వీనర్‌గా జవ్వాది శ్రీనివాస్, సభ్యులుగా దిగుపాటి రాజగోపాల్, తిరుమాని శ్రీనివాసరావు, డి.రోజామని ఉన్నారు. సమావేశానికి తొలుత సీనియర్ సభ్యులు యర్రా కృష్ణారావు జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఈ మధ్య కాలంలో మరణించిన కామ్రేడ్‌లకు సంతాపం తెలిపారు. చల్లా సోమేశ్వరరావు, పి.సాంబశివరావు, ఎస్.పురుషోత్తమ, అరటకట్ల నారాయణమ్మ, జి.శేషారత్నం, దొర.రత్నం, స్వరాజ్యలక్ష్మి హాజరయ్యారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పేదల గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

పేదల గురించి మాట్లాడే హక్కు, జగన్‌కు లేదని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంత్రి సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఆయన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం, ప్రజల ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ములపర్రులో సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

ములపర్రు పంచాయతీలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా సరిగ్గా లేదని, దీంతో ప్రజలు డెంగీ, వైరస్ జ్వరాల బారిన పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆయన సోమవారం ములపర్రులో పర్యటించి మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ పూర్తిగా పంచాయతీ గాలికొదిలేసిందన్నారు. కేవలం ఇద్దరు కాంట్రాక్టు వర్కర్లే పని చేస్తున్నారన్నారు. సిబ్బంది రాకపోవడంతో గ్రామస్తులే చెత్తను తగలబెడుతూ ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా రాజన్ చెరువు ప్రాంతంలో పాలుమూరి జయలక్ష్మి మాట్లాడుతూ తాగునీరు అందించకుండా పంచాయతీ కుళాయి పైపులను డమ్మీ చేసి వదిలేశారన్నారు. చేతి పంపులపైనే ఆధారపడుతున్నామన్నారు. ఇప్పటికైనా ములపర్రు గ్రామ పంచాయతీ వారు రాజన్ చెరువు, పెదగరువు ప్రాంత ప్రజలకు తాగునీరు, మురుగునీరు పారుదలకు, పారిశుధ్య నిర్వహణకు చర్యలు తీసుకుని జ్వరాల బారి నుంచి కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు కేసరిపల్లి శాంతకుమారి, రొక్కాల సువర్ణ రత్నం, అంబటి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఫ్రై డే డ్రై డే పాటించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండొచ్చని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు పేర్కొన్నారు. కడకట్ల పిహెచ్‌సి పరిధిలో జరుగుతున్న వెక్టార్ కంట్రోల్ హైజీన్ ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలను సోమవారం ఆయన పరిశీలించారు. ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యకర్తలు చంద్రకళ, అంగన్వాడీ కార్యకర్త కనకదుర్గ, వార్డు ఇన్‌ఛార్జి పి.రాంబాబు పాల్గొన్నారు.

'టిడిపి సభ్యత్వంతో ప్రయోజనాలు'

ప్రజాశక్తి - భీమవరం టౌన్

టిడిపి సభ్యత్వం తీసుకున్న కుటుంబాలకు ప్రయోజనాలు చేకూరనున్నాయని టిడిపి రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి తెలిపారు. పట్టణం 4, 21వ వార్డుల్లో నిర్వహించిన టిడిపి సభ్యత్వ నమోదు పునరుద్ధరణ కార్యక్రమంలో పాల్గొన్న తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. టిడిపిలో ప్రతి ఒక్కరూ చేరి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గూడూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి నేదునూరి గంగాధర్ తిలక్ పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యలో రాణించాలి

ప్రజాశక్తి - గణపవరం

విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం సరిపల్లిలో ఇండియన్ డిజిటల్ స్కూల్ నూతన భవన నిర్మాణానికి జరిగిన భూమి పూజలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసేందుకు ఉపయోగపడే విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ ప్రభుత్వం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ జివి.ప్రసాద్, ప్రిన్సిపల్ జి.పద్మిని దుర్గ, డిజిటల్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపాల్ సిగ్నా సర్వ విడుదల

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆరోగ్య బీమా కంపెనీలో ఒకటైన మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ తన కొత్త ఆరోగ్య బీమా పథకం 'మణిపాల్ సిగ్నా సర్వ' ను విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధి ప్రసూన్ సిక్దర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి ఆరోగ్య బీమా పరిష్కారాన్ని అందించేలా ఇది రూపొందించబడిందని తెలిపారు. మణిపాల్ సిగ్నా నిబద్ధత కేవలం ఆరోగ్య బీమాను అందించడం కంటే ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. పూర్తి ఆరోగ్య బీమా పరిష్కారాన్ని పరిచయం చేస్తున్నామని, ఇది విభిన్న కస్టమర్ విభాగాలను మాత్రమే కాకుండా, ప్రభుత్వ, రెగ్యులేటర్ 'ఇన్సూరెన్స్' లక్ష్యం చేరుకోవడంలో తోడ్పడుతున్నామని తెలిపారు.

నేడు ఉండిలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉండి

తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కావలి నాగార్జున విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమవరంలోని మ్యాక్సి విజన్ కంటి ఆసుపత్రి వారిచే వైద్య శిబిరం నిర్వహించనున్నారని, ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 15, 22వ వార్డుల్లో చెత్త శుభ్రత, డ్రెయినేజీ వ్యవస్థను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సోమవారం పర్యవేక్షించారు. అనంతరం తాగునీటి సరఫరాను పరిశీలించారు. వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజల ఆరోగ్య రీత్యా పారిశుధ్య కార్మికులకు కమిషనర్ అంజయ్య పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు బొమ్మిడి సూర్యకుమారి, కృష్ణమూర్తి, భారతి సెకిల్ పాల్గొన్నారు.

ఇద్దరు క్షతగాత్రులు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో ఇటీవల జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ కె.స్వామి సోమవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 21న బొలెరో వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డ మండలంలోని కొయ్యేటిపాడు గ్రామానికి చెందిన ముప్పిడి కృపారావు (68) కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందాడు. అలాగే 24 తేదీ రాత్రి బ్రాహ్మణచెరువు - పోలమూరు రోడ్డులో కంకర గుట్టను ఢీ కొని తీవ్రంగా గాయపడ్డ గణపవరం మండలం మొయ్యేరు గ్రామానికి చెందిన జవ్వాది ధనరాజు (34) ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వారి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

నాలుగు మోటారు సైకిళ్లు, ఒక ఆటో స్వాధీనం

ప్రజాశక్తి - పాలకోడేరు

ద్విచక్ర వాహనాలు, ఆటోలను చోరీ చేస్తున్న ఇద్దరు యువకులను పాలకోడేరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గొల్లలకోడేరుకు చెందిన రెడ్డి శివ (20), గొల్లలకోడేరుకు చెందిన ఈదా ప్రశాంత్ (19) ఇటీవల కాలంలో విస్సాకోడేరులో రెండు మోటార్ సైకిళ్లు, మోగల్లులో ఒక మోటార్ సైకిల్, భీమవరం రూరల్ మండలం డేగాపురంలో ఒక బజాజ్ ఆటోను, తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో పల్సర్ మోటార్ సైకిల్‌ను చోరీ చేశారు. చోరీ చేసిన వీటి విలువ సుమారు రూ.5.19 లక్షలు ఉంటుందని భీమవరం రూరల్ సిఐ బి.శ్రీనివాసరావు, పాలకోడేరు ఎస్ఐ మంతెన రవివర్మ తెలిపారు. తమకు అందిన సమాచారం ప్రకారం మోగల్లు శివారులోని ఒఎన్‌జిసి సైట్ వద్ద చెట్ల పొదల్లో దాచిపెట్టిన నాలుగు మోటార్ సైకిల్స్‌ను దొంగిలించిన ఆటోలో తరలించి అమ్ముకుందామని ప్రయత్నించిన క్రమంలో పట్టుకున్నామన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ధాన్యం కొనుగోలులో దళారుల జోక్యం సహించం

తూకాల్లో మోసం చేస్తే చర్యలు తప్పవు - జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - వీరవాసరం

ధాన్యం కొనుగోళ్లలో దళారుల జోక్యం సహకరించబోనని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వీరవాసరంలోని రైతుసేవా కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతం తెలిపే టెక్నికల్ మిషన్, రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎంత ధాన్యం సేకరించారు, రైతులకు 48 గంటల్లో డబ్బులు జమవుతున్నాయా లేదా వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యపురిలో ఆరబెట్టిన ధాన్యాన్ని, రైతులు పట్టుబడులు జరిగే చోటకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కాటాపై


వీరవాసరంలో ధాన్యం తూకాన్ని పరిశీలిస్తున్న జెసి

గోనె బస్తాలు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ తూకాల్లో మోసం జరుగుతుందని ఫిర్యాదులు రావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దళారులు ఎవరైనా రైతులను మోసగించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జెసి వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, తహశీల్దార్ రామాంజనేయులు, లేబర్ ఆఫీసర్ కెవిఆర్.శర్మ, సిఎస్ ఆర్ఐ సురేష్ తదితరులు ఉన్నారు.

ఎంపికైన బాస్కెట్ బాల్ జట్లు ఇవే..

ప్రజాశక్తి - పెనుమంట్ర

డిసెంబర్ 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ మార్టేరులో జరిగే అంతర్ జిల్లాల ఎంఎల్ఎ కప్ బాస్కెట్ బాల్ పోటీల కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్స్ మెన్, ఉమెన్ బాస్కెట్ బాల్ జట్ల ఎంపికలు పూర్తయ్యాయని యూత్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ (వైబిఎ) పెసిడెంట్ చిర్ల బాలాజీ రెడ్డి తెలిపారు. సోమవారం మార్టేరు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌ను డిసెంబర్ 7న మాజీ మంత్రి, ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్స్ మెన్స్ విభాగం జట్టు సభ్యులుగా ఐపిబిసిహెచ్.కుమార్ వర్మ, టి.మనుసందీప్, ఎ.శ్రీరామ్, షేక్ అహ్మద్ అలీషా, కెబిఎస్ అన్నవరం రెడ్డి, ఎస్‌టికె.రెడ్డి, ఎం.శివ, కె.మణికంఠ, ఇ.సత్యకిరణ్, డి.ఆశిష్‌రాజ్, కెకె.రవితేజ రెడ్డి, కె.లోకేష్‌లు, స్టాండ్ బై సభ్యులుగా ఆర్.విజయ శంకర్, కె.మణికంఠ గోపాల్‌రెడ్డి, కె.డానీ జోసఫ్, సూర్యకిరణ్ ఎంపికయ్యారని తెలిపారు. ఉమెన్స్ విభాగం జట్టు సభ్యులుగా బి.లీలావతి, బి.భవానీదేవి, ఎ.టోలీ అనిత తదితరులు ఎంపికయ్యారని తెలిపారు.

మహిళా హింసకు వ్యతిరేకంగా అవగాహన అవసరం : జెసి

ప్రజాశక్తి - భీమవరం

మహిళలపై జరిగే హింసకు వ్యతిరేకంగా విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళలపై హింసా వ్యతిరేక దినోత్సవం వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ డిసెంబర్ పదో తేదీ వరకూ జరిగే మహిళలను స్వేచ్ఛగా బతకనిద్దాం, మహిళలను స్వేచ్ఛగా ఎదగనిద్దాం అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రవేటు సంస్థలు పాఠశాలలు, కళాశాలలలో విస్తత ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఎ ఎం.వెంకటేశ్వర్లు, పలువురు జిల్లా అధికారులు, ప్రముఖులు పాల్గొన్నారు.

పిచ్చయ్య ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

యలమంచిలి: మండలంలోని కాజ-గొంది సెంటర్‌లో పిచ్చయ్య ఫ్యామిలీ రెస్టారెంట్ అండ్ టిఫిన్స్ హోటల్‌ను ప్రముఖ సామాజికవేత్త పిఎస్ఆర్ ట్రస్ట్ అధినేత పితాని నాగరాజు సోమవారం ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిచ్చయ్య మోటల్ మంచి రుచికరమైన వంటకాలతో ప్రజల అభిరుచికి తగ్గట్లుగా దినదినాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు, పిచ్చయ్య హోటల్ అధినేత కడలి భాస్కరరావు మాట్లాడుతూ లాభాపేక్షతో వ్యాపారాన్ని ప్రారంభించలేదని, తన తండ్రి పిచ్చయ్య పేరు సార్థకత కోసం తక్కువ రేట్లకే ప్రజలకు మంచి పసందైన భోజనం అందించాలనే ధ్యేయంతో దీన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో కాజ, గొంది, కలగంపూడి, చించినాడ, కొంతేరు, ఊటాడ గ్రామాల పెద్దలు, ప్రజలు, స్థానిక బాలాజీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.


రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న నాగరాజు

సిపిఎం మండల కార్యదర్శిగా ప్రసాద్

ప్రజాశక్తి - పెనుమంట్ర



సిపిఎం పెనుమంట్ర మండల కార్యదర్శిగా కోడె ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం పొలమూరులో జరుగుతున్న 8వ మండల మహాసభలో మండల కార్యదర్శిగా కోడే ప్రసాద్‌ను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో చర్చించిన పలు తీర్మానాలను సభ ఆమోదించింది. మండలంలో కొత్తగా నిర్మించిన నిరుపేదల గృహ నిర్మాణ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, మురుగునీరు కాల్వ వద్ద పశువుల రేవును పటిష్టంగా నిర్మించాలని, బ్రాహ్మణచెరువు సెంటర్‌లో ప్రయాణికులకు సౌకర్యంగా పబ్లిక్ టాయిలెట్స్ పంచాయతీ వారు నిర్మించాలని, శిథిలావస్థకు చేరిన సోమరాజు ఇల్లింద్రపర్రు పంట కాల్వ లాకులను సత్వరం ఆధునికీకరించాలని, అధ్వానంగా ఉన్న పొలమూరు నుంచి చెన్నాడ చెరువు మార్గంలో రహదారులు నిర్మించాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

డిఎస్‌పి శ్రీవేదను కలిసి వైఎన్ ప్రిన్సిపల్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం డిఎస్‌పిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జి.శ్రీవేదను సోమవారం వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్‌పి శ్రీవేదను కళాశాల ప్రిన్సిపల్ కనకారావు కళాశాలలో జరగబోయే కార్యక్రమాలకు ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్, డ్రగ్స్ నిరోధంపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాలకు రిసోర్స్ పర్సన్‌గా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - తణుకు

ఇటీవల జరిగిన గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా అల్లూరి సీతారామరాజుపై క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి సోమవారం బహుమతులు అందజేశారు. క్విజ్ పోటీల్లో తనమ విద్యార్థినులు బహుమతులు సాధించారని ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్ సుందరీబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా సుందరీబాయ్ మాట్లాడుతూ క్విజ్ పోటీల్లో బి.అమ్మాణి, కె.జాన్సీ నాగభవాని ద్వితీయ బహుమతి సాధించారని తెలిపారు.

రామకృష్ణకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - నరసాపురం

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి విజయనగరంలో అత్యంత వైభవంగా రాష్ట్ర సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలం చిట్టవరం గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఆకన రామకృష్ణ రాష్ట్రస్థాయి ఉత్తమ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఎంఎల్‌సి పాకలపాటి రఘువర్మ, మాజీ ఎంఎల్‌సి గాదె శ్రీనివాసుల నాయుడు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘం నాయకులు, అధికారులు, గ్రామస్తులు రామకృష్ణను అభినందించారు.


అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

వేతన బకాయిలు చెల్లించాలని స్కూల్ స్వీపర్ల ధర్నా

ప్రజాశక్తి - పోడూరు

ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన సోమవారం స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒ జి.విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పిల్లి ప్రసాద్ మాట్లాడుతూ ఐదు నెలల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఐదో తేదీనాటికి వేతనాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి కె.వెంకటేశ్వరరావు, స్వీపర్లు జి.కుమారి, పిల్లి మరియమ్మ, దేవ ఎస్తేరురాణి, వి.రంగమ్మ, ఎస్.శ్రీదేవి, రాపాక సుశీల, పెదపాటి జయకుమారి, చిలకపాటి కనకమహాలక్ష్మి, కాంద్రేకుల మంగమ్మ, గోగులమండ శాంతకుమారి, బి.జయలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక సమస్యలపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - గణపవరం



నరసాపురం : మాట్లాడుతున్న పొగాకు పూర్ణ

గణపవరం డిగ్రీ కాలేజీలో సోమవారం అంతార్జాతీయ స్త్రీ హింసా నిరోధక దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తయారు చేసిన వాల్ పోస్టరును కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు ఆవిష్కరించారు. అనంతరం మధురాజు మాట్లాడుతూ ప్రస్తుతం సోషల్ మీడియా యుగం నడుస్తోందన్నారు. సామాజిక సమస్యలపై అవగాహన కలిగించాలని విద్యార్థులు చేసే ప్రయత్నం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు కె.స్వరూపరాణి, టి.అక్కిరాజు, ఎన్‌విఎన్‌బి శ్రీనివాస్‌రావు, జి.వెంకట్రావు, జివి.శారదాదేవి, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

నరసాపురం : స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవాన్ని రాయపేట లెనిన్ హైస్కూల్లో నరసాపురం కాపు వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళా సాధికారత గురించి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి పాల్గొని మాట్లాడారు. ఆడ, మగ సమానమనే భావన బాల్యదశలోనే నాటుకోవాలని అప్పుడే మహిళలపై వేధింపులు తగ్గుతాయని తెలిపారు. కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి స్వర్ణలత, కోశాధికారి రంగినీడి భరణి, ఉపాధ్యక్షురాలు పుప్పాల ఉషాకమల పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నరసాపురం ఉమెన్స్ కాలేజీలో విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ మాట్లాడుతూ రోజురోజుకీ మహిళలు, బాలికల మీద హింస పెరిగిపోతోందని, దీన్ని అరికట్టాల్సిన ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నాయని తెలిపారు. వారికి ఏ విధమైన శిక్షలు వేయకపోవడం వల్లే ఇలాంటి దారుణాలు కొనసాగుతున్నాయన్నారు. ఎన్ని రకాల చట్టాలు తీసుకొచ్చినా బాలికల మీద దాడులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల వైజాగ్‌లో విద్యార్థినిపై అత్యాచారం నిన్న తిరుపతిలో ఏడు సంవత్సరాల బాలికపై అత్యాచారం ఇవన్నీ చూస్తుంటే ఆడపిల్లల్ని ఎలా కాపాడుకోవాలని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈరోజు నుంచి డిసెంబర్ 10 వరకు హింస వ్యతిరేక దినోత్సవాలు జరుపుతామని, కచ్చితంగా సమస్యను పరిష్కరించే వరకూ పోరాడుతామని తెలిపారు. విద్యార్థులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ అమ్మాజీ, శాలిని ప్రిన్సిపల్ మాట్లాడారు. మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - తణుకు

వాహదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని తణుకు ట్రాఫిక్ ఎస్ఐ డి.ఆదినారాయణ అన్నారు. సోమవారం స్థానిక నరేంద్ర సెంటర్లో జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులు, ఆటో డ్రైవర్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ మద్యం సేవించి ఆటోలు నడపడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు.

విఆర్‌కు తణుకు రూరల్ ఎస్ఐ, ఎఎస్ఐ

ప్రజాశక్తి - తణుకు రూరల్

గేదెల చోరీ కేసు విషయంలో తణుకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో డబ్బులు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తణుకు రూరల్ ఎస్ఐ ఎజిఎస్.మూర్తి, ఎఎస్ఐ అంజిబాబులను విఆర్‌కు పంపినట్లు రూరల్ సిఐ ఎం.కృష్ణకుమార్ తెలిపారు. ఈ అంశంపై తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ విచారణ చేపట్టారన్నారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం అత్తిలి మండలం బల్లిపాడుకు చెందిన ఆకుల మారుతీ అయ్యన్నరావు తణుకు మండలం వేల్పూరులో బండి ఈశ్వరరావుకు చెందిన స్థలం లీజుకు తీసుకుని గేదెల ఫారం నిర్వహిస్తున్నారు. వీరి మధ్య విభేదాలు రావడంతో రెండు గేదెలను ఈశ్వరరావు అపహరించినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. వీరభద్రపురంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్న బండి రామలింగేశ్వరరావు అలియాస్ ఈశ్వరరావు, దువ్వ గ్రామానికి చెందిన కోసూరి సతీష్, వీరభద్రపురానికి చెందిన దున్నా సోమరాజును అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ ఘటనలో గేదెలు రికవరీ కాకపోవడంతో నిందితుడు ఈశ్వరరావు నుంచి రూ.13 లక్షలు వసూలు చేసిన పోలీసులు తనకు కేవలం రూ.5లక్షలు మాత్రమే ఇచ్చినట్లు బాధితుడు అయన్నరావు ఆరోపించారు. ఈ క్రమంలో బాధితుడు ఉన్నతాధికారులను ఆశ్రయించాడు. ఈ నెల 19న తణుకు రూరల్ సర్కిల్ కార్యాలయంలో తాడేపల్లిగూడెం డిఎస్‌పి విశ్వనాథ్ నిందితులను, బాధితుడిని విచారణ నిర్వహించిన అనంతరం ఎస్ఐ, ఎఎస్ఐలను విఆర్‌కు పంపించారు.

పిఎఫ్ సొమ్ము అవకతవకలపై విచారించాలి

ఎఐటియుసి ఆధ్వర్యాన జెసికి వినతి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల పిఎఫ్ సొమ్ము అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి కార్మికులకు న్యాయం చేయాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు, ఎపి మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ తణుకు అధ్యక్షులు కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లోని కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ తణుకు ప్రభుత్వాసుపత్రిలోని కాంట్రాక్టు కార్మికుల పిఎఫ్ సొమ్ము ఏడాదికిపైగా వారి ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. సంబంధిత పస్ట్ ఆబ్జెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టర్ ప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. కార్మికుల ఖాతాల్లో పిఎఫ్ సొమ్ము జమ చేస్తున్నామని కాంట్రాక్టర్ చెబుతున్నారని, వాస్తవానికి సొమ్ము కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో జమ కావడం లేదని తెలిపారు. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రుల్లో కూడా సదరు కాంట్రాక్టు ఏజెన్సీ సక్రమంగా పని చేయడం లేదని ఆరోపించారు. తక్షణమే అధికారులు పిఎఫ్ సొమ్ము విషయంలో విచారణ కమిటీ నియమించి సమగ్ర విచారణ జరిపించి పిఎఫ్ సొమ్ము అవకతవకలపై నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. కార్మికుల రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, తణుకు 150 పడకల జిల్లా కేంద్ర ఆసుపత్రి స్థాయికి అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.ప్రసన్నకుమారి, పి.విజయలక్ష్మి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నెక్కంటి జగదాంబ, సికిలే పుష్పకుమారి, సిపిఐ నేత ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని జనసేన కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సమక్షంలో కొపనాతి ప్రభాకరరెడ్డి, నాగిడి భాస్కరరావు ఆధ్వర్యంలో మొగల్తూరు మండలం దారతిప్ప గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు సరిపల్లి సుబ్బరాజు సోమవారం జనసేనలో చేరారు. జనసేన సిద్ధాంతాలు, ప్రభుత్వ పనితీరు నచ్చి పవన్‌కళ్యాణ్, నాయకర్ నాయకత్వంలో పని చేయాలనే ఉద్దేశంతో పార్టీలో చేరానని సుబ్బరాజు తెలిపారు. జన సేన బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. వారికి నాయకర్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

కాళ్లకూరులో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో సత్యనిష్ఠ నెలకొనాలని సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతాలు చేపట్టినట్లు తెలిపారు. వేద మంత్రోచ్ఛరణ మధ్య వ్రతాలు వేద పండితులు అనిపెద్ది ఫణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీ సంఖ్యలో యాత్రికులు తరలివచ్చి సామూహిక వ్రతాల్లో పాల్గొన్నారు. తాడినాడ గ్రామానికి చెందిన దాత వేగేశ్న ఏడుకొండలరాజు సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతాలకు ఆర్థికంగా సహకరించారు. కార్యక్రమంలో ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, దేవస్థాన మాజీ ఛైర్మన్ అడ్డాల నాగరాజు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

ప్రజాశక్తి - ఉండి

ఉండి కాపులపేటలో మండల, జిల్లా పరిషత్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు గ్రామ సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ తెలిపారు. సోమవారం కాపులపేటలోని మూడో వార్డులో నిర్మిస్తున్న రోడ్లను పరిశీలించిన ఆమె మాట్లాడారు. కాపులపేట పల్లపు ప్రాంతం కావడంతో వర్షాలు వస్తే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయని తెలిపారు. విషయాన్ని స్థానికులు ఎంఎల్ఎ రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లగానే స్పందించిన ఆయన వెంటనే ఆయా రోడ్లను పటిష్టపర్చి ఎత్తు పెంచి నిర్మించాలని సూచించడంతో వెంటనే పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. స్థానిక టిడిపి నాయకులు గురుగుబిల్లి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఎంఎల్ఎ పనులు వెంటనే ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేయడం, అధికారులు ప్రజాప్రతినిధులు రోడ్ల పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలిపారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసి రాజు ఆదేశించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 25 ఫిర్యాదులను స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల గుర్తింపు కార్డులకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ఆధార్ కార్డు తరహాలో విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయంలో భాగంగా మండలంలోని నాలుగు ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ సిహెచ్ త్రిశూల పాణి సోమవారం తెలిపారు. 12 అంకెలతో కూడిన అపార్ (ఆటోమేటడ్ పర్మినెంట్ అకౌంట్ రిజిస్ట్రీ) నంబర్ ఏర్పాటు చేయనుందని తెలిపారు. దీనిలో భాగంగా మొగల్తూరులోని ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సంబంధించి ఆధార్ కార్డులో మార్పులు చేర్పులు, పుట్టిన తేదీలో మార్పులు ఉన్నా శిబిరంలో మార్చుకునే వెసులు బాటును కల్పించారు. ఈ క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రకటన

నా క్లయింటు పాతపాటి కనకదుర్గ, (ఆధార్ నెం.2598 5437 2504) (ఫోన్ నెం.9036240311) భర్త : లేటు PVRK బంగార్రాజు, ఏలూరు వారి భర్త తాలూకు డిశ్చార్జ్ బుక్ మరియు ఐడి కార్డు 14583735 - వై రును వారు ఏలూరు పాతబస్టాండ్ నుండి పెన్షన్ లైనుకు వారి యింటికి వెళుచుండగా మిస్ అయినాయి. కావున సదరు డిశ్చార్జ్ బుక్ మరియు ఐడి కార్డు 14583735 - వై ఎవ్వరికైనా దొరికిన ఎడల నా క్లయింటు పాతపాటి కనకదుర్గ, (ఫోన్ నెం.9036240311)కు లేదా నాకు అంద చేయవలసినదిగా కోరుచున్నాను.

స్థలం : ఏలూరు
తేది.25-11-2024

కె.కృష్ణమాచార్యులు
న్యాయవాది, ఏలూరు.
ఫోన్‌నెం.9440116456.